# తనదాకా వస్తేగానీ

-నామని సుజనాదేవి

"ఏమయ్యిందిరా వెళ్ళిన పని? ఏమన్నారు డాక్టర్‌గారు" అడిగింది వసుంధర ఆతృతగా.

"ఆఁ... ఏంలేదు" అంటూ నసుగుతున్న కొడుకు శివను, ఏడుస్తూ లోనికెళ్లిన శిరీషను చూడగానే విషయం అర్థమైపోయిందామెకు.

"ఆఁ...తెలిసిందిలే. ఈజన్మలో పిల్లలు పుట్టే యోగం దీనికి లేదు. అందుకనే బుద్ధిగా మళ్ళీ పెళ్లిచేసుకోరా అంటే డాక్టర్ దగ్గరికెళితే ఏ విషయం తెలుస్తుందని, ఏదో చావని ఆశతో ఊర్కున్నావు. తెలిసిందిగా ఇంకేం చేస్తాం. మరో పెళ్ళి చేసుకోక తప్పదు" ఇలా ఆమె వాక్ప్రవాహం సాగుతూనే ఉంది.

లోపలికెళ్లిన శిరీష కుమిలికుమిలి ఏడుస్తోంది. ఇందులో అసలు తన తప్పేం ఉందని. ఆ భగవంతుడు తనకా అవకాశం లేకుండా చేస్తే దానికి తానెలా బాధ్యురాలవుతుంది. తన కళ్లముందే తన భర్తకు మరొకరితో పెళ్లిచేస్తే చూసి తాను తట్టుకోగలదా? ఈ విషయంలో మాత్రం తాను స్వార్థపరురాలే. అసలు శివకు కూడా ఇష్టంలేదు. కానీ తండ్రి లేనందుకు తల్లి చిన్నప్పట్నుంచీ ఎంతో కష్టపడి పెంచింది కాబట్టి ఆమెకే మాత్రం కష్టం కల్గించడాన్ని, ఆమె ఇష్టానికి వ్యతిరేకంగా ఏ పనీ చేయడాన్ని ఇష్టపడడు. ఆమె మాటకు ఎదురుచెప్పగలిగే ధైర్యం ఆయనలో లేవు.

తమ పెళ్లై ఆరేళ్ళయ్యింది. ముసలి వయస్సులో చిన్నపిల్లల్తో కాలక్షేపం చేయాలని ఎవరికైనా అనిపిస్తుంది. తనకు మాత్రం చిన్నపిల్లలతో అమ్మా అనిపించుకోవాలని, వారి ముద్దు ముద్దు మాటల్ని, ఆటల్ని చూడాలని ఉండదూ! ఇలా ఆలోచిస్తున్న శిరీష బయట సందడిగా మాటలు వినబడడంతో కళ్లు తుడుచుకుని హాలులోకొచ్చింది.

హాల్లో ఆడపడుచు అనూష, ఆమె భర్త రవితేజ కన్పించగానే పెదాలపై చిరునవ్వు పులుముకుని, "ఇప్పుడే వచ్చారా అన్నయ్యా? బావున్నావా అనూష?" అంటూ పలకరించింది.

రవితేజకి అనూషకి పెళ్ళై రెండేళ్ళయ్యింది. చెల్లెళ్ళు లేని రవితేజకి అన్నయ్యా అంటూ నోరారా పిల్చి ఆప్యాయంగా మాట్లాడుతూ కొసరి కొసరి వడ్డించే శిరీష అంటే చాలా ఇష్టం.

చెల్లెమ్మా, చెల్లెమ్మా అంటూ స్వంత చెల్లెల్లా చూసుకుంటాడు. పండుగకు రమ్మని పిలవడం వల్ల వచ్చి పండుగ తర్వాత బలవంతంపైన రెండు రోజులుండి వెళ్లిపోయారు.

* * *

ఒకటీ రెండు నెలలు గడిచాయి. దాదాపుగా ఒక సంబంధం కుదిరినట్లే అనుకుంటున్న సమయంలో ఒకరోజు హఠాత్తుగా రిక్షా దిగుతున్న అనూషను చూస్తూ వసుంధర...

"సమయానికి వచ్చావమ్మా నేనే కబురు చేద్దామనుకుంటున్నాను. అవునూ... ఒక్కదానివే వచ్చావు.... అల్లుడుగారేరి?" అంటూ పలకరించింది.

సమాధానంగా ఏడవడం మొదలుపెట్టేసరికి దెబ్బకు బెంబేలు పడిపోయింది వసుంధర.

"ఏంటే ఏమయిందే నా తల్లీ! ఏమైనా గొడవలొచ్చాయా" అంటూ ఆదుర్దా పడింది. ఎంత అడిగినా ఏడుపు, మౌనమే సమాధానం అయ్యింది. "రెండేళ్లయినా పిల్లలు లేరని తేజ వాళ్లమ్మ తేజకి మరో సంబంధం చూస్తుందంట" ఇది వినగానే షాక్ తగినట్లయి వెంటనే మాట్లాడలేదు వసుంధర.

* * *

'అనూష తండ్రి లేని పిల్ల. తనకా వయసయిపోయింది. ఎక్కువకాలం బ్రతకదు. అబ్బాయి తను ఉన్నప్పుడు తన మాట తీసేయలేక ఎంత బాగా చూసుకున్నా తను లేకపోతే ఈ ప్రేమ జీవితాంతం ఇలాగే ఉంటుందా?...ఏమిటీ అపశృతి' అని ఆలోచిస్తూ అన్యమనస్కంగానే గడిపింది.

ఇలాగని ఇటు కొడుక్కీ, కోడలికి చెప్పలేదు. ఎందుకంటే "నువ్వు చేస్తున్నదేమిటి?" అనొచ్చు.

కూతుర్ని చూస్తే గుండె తరుక్కుపోయింది. చివరకు తేజను కల్సి ఎలాగో బ్రతిమిలాడి ఆ ఉద్దేశ్యం మాన్పించాలని నిశ్చయించుకుంది. సహజంగా అతను చాలా మంచివాడు. ఏదో తల్లి చెప్పిన మాటలు విని ఉంటాడు. తను చెబితే సర్దుకుంటుంది. ఇక ఈ విషయంలో జాప్యం చేయవద్దనుకుని తెల్లవారే కూతుర్ని తీసుకుని బయల్దేరింది.

ఇంటికెళ్ళేసరికి ఇంట్లోనే ఉన్నాడు తేజ.

అనూషను చూసి నవ్వుతూ అత్తగార్ని "బావున్నారా?" అంటూ పలకరించాడు.

మౌనంగా తలూపింది గానీ మాట పెగలలేదామెకు.

తర్వాత తేజతో "ఏంటి బాబూ! మరో పెళ్లి అన్నారట. ఒక్కగానొక్క కూతురని ఎంతో గారబంగా పెంచాను. తండ్రి లేని పిల్ల. ఎంతో గారాబంచేసేవారాయన. ఇంటి మహాలక్ష్మి అని కోరిందల్లా తెచ్చేవారు. అలాంటిది ఈ విషయం అసలు అది తట్టుకోగలదా? చూడండి రెండురోజులకే లంఖణాలు చేసినదానిలా ఎలా అయిపోయిందో. దయచేసి ఆ ఆలోచన మానుకో బాబు. ఇప్పుడే ఏం వయసయిపోయిందని. నీ కన్నా పెద్దదాన్ని. నీకు దండం పెడతాను. ఒక్కసారి ఆలోచించు బాబు" అంటూ నచ్చచెబుతున్న అత్తగార్ని అన్ని మాటలు అననిచ్చి అప్పుడు మాట్లాడ్డం మొదలు పెట్టాడు రవితేజ.

"అవునత్తయ్యా. మీ కూతురిలాంటి మనస్సే అందరి ఆడవాళ్ళదని మీకు తెలియదా? మీరు ఆడవారై ఉండి శిరీషనెందుకలా సాధించారు? అప్పుడివన్నీ గుర్తురాలేదా. కోడల్ని అన్నప్పుడు గుర్తుకురాని ఆవేశం కూతురి మాటలు వినగానే వచ్చిందా? రెండురోజులకే మీ అమ్మాయిని ఇలా అయ్యిందంటున్నారే ఇన్నాళ్ళుగా సాధిస్తుంటే శిరీష ఎలా అయిపోవాలి. కూతురికి ఒక నీతి, కోడలికి ఒక నీతా? ఇదెక్కడి న్యాయం? ఒకవేళ ఇదే శిరీషలో లోపం లేకుండా శివలోనే లోపం ఉంటే మరొకతనికిచ్చి శిరీషను వివాహం చేసేవారా?"

అతనలా మాట్లాడుతుంటే అన్నీ నిజమే కదా....ఛ... తనెంత తప్పుగా ప్రవర్తించింది అన్పించసాగింది వసుంధరమ్మకు.

"నాకింత ఆలోచన రాలేదు బాబు. నేనిలా ఆలోచించలేదు. నాకళ్ళు తెరిపించావు. నా కొడుక్కి మళ్లీ పెళ్లిచేయను" అంటూ పశ్చాత్తాపంగా అంటున్న వసుంధరమ్మతో-

"మీరు మరోలా అనుకోకండి అత్తయ్యగారు. ఇది కేవలం నాటకమే. మొన్న పండక్కి వచ్చినప్పుడు చూచాయగా విషయం తెలిసి బాధపడ్డాను. ఇప్పుడు మీరు చూసిన సంబంధం తెలిసి

ఈ ప్లాన్ వేసింది మీ కూతురే. ఆమె నీరసానికి కారణం ఆమెకిప్పుడు రెండోనెల. మేమే రెండు సంవత్సరాలు వద్దనుకున్నాం. పిల్లలు కావాలనుకుంటే అనాథ శరణాలయంలో వేలకొలదీ ఉన్నారు. వాళ్లంతా ఏ తప్పు చేయకపోయినా శిక్ష అనుభవిస్తున్నవారు. అందులో ఏ ఒక్కర్నీ తీసుకుని పెంచుకున్నా సమాజానికెంతో మేలు చేసినవారవుతారు. అభం శుభం తెలియని, ఏ కల్మషాలు లేనివారికి నూతన జీవితాన్ని ప్రసాదించినవారవుతారు. ఏమంటారు?'' అంటున్న రవితేజ మాటలకు ఆశ్చర్యానందాలలో మునిగిపోయిన వసుంధరమ్మ-

"చిన్నవాడివైనా మంచిగా బుద్ధి చెప్పావు. రేపే కొడుకు, కోడలితో కలిసి అనాథ శరణాలయానికి వెళతాను. వస్తాను. అనూ నీ ఆరోగ్యం జాగ్రత్తమ్మా. అబ్బాయిని తీసుకుని నాలుగురోజులుండడానికి రామ్మా... వెళ్ళొస్తా బాబూ.. వెళ్ళొస్తా వదినగారూ'' అంటూ రెండు శుభవార్తలూ కోడలి చెవిలో వేయడానికి హడావుడిగా వెళ్లిపోయింది.

వెళుతున్న ఆవిడను చూసి కథ సుఖాంతమయినందుకు మనసారా నవ్వుకున్నారు తేజ, అనూషలు. వెంటనే ఫోన్‌లో ఈ విషయం అన్నయ్యకు చెప్పడానికి లేచింది అనూష.

★

